RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in   rajadhanivoicedaily@gmail.com

సంపుటి : 02 | సంచిక : 274 | 26 బుధవారం ఆగష్టు 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

RAJADHANI VOICE రాజధాని వాయిస్ TELUGU DAILY

విలేఖరులు కావలెను

రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కోనసాగుటకు
గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు
నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు
మండలాల వారిగా విలేఖరులు కావవలెను
ఆసక్తి గలవారు సంప్రదించగలరు.
9030343195
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

## రాయదుర్గం నియోజకవర్గంలో సుజ్లాన్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు శంకుస్థాపన


**లిసుజ్లాన్ S144 న్యూ బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్ ను ప్రారంభించిన విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్**




**రాజధాని వాయిస్ రాయదుర్గం, ఆగస్టు 25 :** పవన విద్యుత్ రంగంలో ఏపీకి పెద్దఎత్తున పెట్టుబడులు తరలివస్తున్నాయి. అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం కణేకల్లు మండలం హులికెర గ్రామం వద్ద సుజ్లాన్ 1,325 మెగావాట్ల విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆయా పవన విద్యుత్ ప్రాజెక్టులు రాయదుర్గం, ఉరవకొండ, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో ఏపీ ప్రభుత్వ భాగస్వామ్యంతో నెలకొల్పనున్నారు. ఇందులో భాగంగా సుజ్లాన్ ఎస్144 న్యూ బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్ ను మంత్రి ప్రారంభించారు. రూ.10వేల కోట్ల పెట్టుబడితో సుజ్లాన్ సంస్థ ఏర్పాటుచేయనున్న పవన విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 4వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ముందుగా కణేకల్లు మండలం ▶▶2

## ప్రపంచస్థాయి సౌకర్యాల కల్పనకు సీఎం ఆదేశాలు

- గోదావరి పుష్కరాలకు ఘన ఏర్పాట్లు
- రూ.4,026 కోట్లతో 4,932 అభివృద్ధి పనుల పురోగతి సమీక్ష
- భక్తులు, పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు
- స్థానిక ప్రజలను భాగస్వాములను చేయాలని సూచన
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు




**రాజధాని వాయిస్ అమరావతి :** వచ్చే ఏడాది నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. దేశ, విదేశాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చే భక్తులు, పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. పుష్కరాల సందర్భంగా రవాణా, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య సేవలు, భద్రత, వసతి, సమాచార సాంకేతిక సేవలను సమగ్రంగా అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జూలై 7 వరకు 12 రోజుల పాటు జరిగే గోదావరి పుష్కరాలను రాష్ట్ర ప్రతిష్ఠకు తగిన రీతిలో నిర్వహించాలని సీఎం పేర్కొన్నారు. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించడంతో ▶▶2

## ఏపీ-యూకే మధ్య కీలక ఒప్పందం

- పట్టణాభివృద్ధికి ప్రభుత్వాల మధ్య ఎంఓయూ – అమరావతి అభివృద్ధికి సాంకేతిక సహకారం
- ప్రపంచస్థాయి నగర నిర్మాణంలో యూకే భాగస్వామ్యం
- మౌలిక వసతుల విస్తరణకు కొత్త దిశ – మంత్రి పొంగూరు నారాయణ



**రాజధాని వాయిస్ అమరావతి, ఆగస్టు 25 :** ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మరియు యునైటెడ్ కింగ్‌డమ్ ప్రభుత్వాల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల అభివృద్ధి, ఆధునిక నగరాల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వ-ప్రభుత్వ స్థాయిలో ఈ అవగాహన ఒప్పందం కుదిరినట్లు మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా రాష్ట్ర పట్టణాల అభివృద్ధికి అంతర్జాతీయ ▶▶2

## ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తగా జస్టిస్ మల్లిఖార్జునరావు ప్రమాణ స్వీకారం




**రాజధాని వాయిస్ విజయవాడ, ఆగస్టు 25:** ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తగా నియమితులైన హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లిఖార్జునరావు మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని లోక్‌భవన్ దర్బార్ హాల్‌లో గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ ఆయనతో ప్రమాణం చేయించారు. జీఏడీ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు కార్యక్రమాన్ని ప్రారంభించగా, అనంతరం ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త రిజిస్ట్రార్.. జస్టిస్ మల్లిఖార్జునరావును లోకాయుక్తగా నియమిస్తూ గవర్నర్ జారీ చేసిన నియామక వారెంట్‌ను చదివి వినిపించారు. ప్రమాణ స్వీకారం అనంతరం గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జస్టిస్ మల్లిఖార్జునరావును అభినందించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో కార్మిక, కర్మాగారాలు, బాయిలర్లు, బీమా వైద్య సేవల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, హైకోర్టు న్యాయమూర్తులు, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. అనంతరాము, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, ఏపీ శాసనసభ సెక్రటేరియట్ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర, న్యాయశాఖ అధికారులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రెబల్ ఎంపీలకు సుప్రీం నోటీసులు

- 20 మంది ఎంపీలకు నోటీసులు జారీ చేసిన ధర్మాసనం
- అనర్హత పిటిషన్లపై విచారణ వేగవంతం చేయాలన్న టీఎంసీ
- కేవలం నోటీసులు సరిపోవని కోర్టు వ్యాఖ్య
- విలీనం చెల్లుబాటుపై రెబల్ వర్గం వాదన



**న్యూఢిల్లీ, ఆగస్టు 25 :** తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది రెబల్ లోక్‌సభ సభ్యులపై దాఖలైన అనర్హత పిటిషన్ల వ్యవహారంలో సుప్రీంకోర్టు కీలక చర్యలు చేపట్టింది. ఈ ఎంపీలకు మంగళవారం నోటీసులు జారీ చేస్తూ వారి వాదనలు వినిపించాలని ఆదేశించింది. ఫిరాయింపుల నిరోధక చట్టం కింద వారిపై చర్యలు తీసుకోవాలంటూ టీఎంసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం విచారణ జరిపింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, ▶▶2

## వెలిగొండ జలాలతో కరువుకు చెక్ : సీఎం

- ఆగస్టు 31న ఫేజ్-1 ప్రారంభానికి సిద్ధం
- 10.7 టీఎంసీల నీటిని నల్లమల సాగర్‌కు విడుదల
- లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టు
- పశ్చిమ ప్రకాశం అభివృద్ధికి కొత్త దిశ



**రాజధాని వాయిస్ అమరావతి, ఆగస్టు 25 :** ఎన్నో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-1ను ఈ నెల 31న ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఎన్నో అవాంతరాలు, సవాళ్లు, అడ్డంకులను అధిగమించి ప్రాజెక్టు తొలి దశను పూర్తి చేశామని పేర్కొన్నారు. తీవ్ర కరువు ప్రాంతంగా పేరున్న ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజలకు కృష్ణా జలాలను అందించడం ద్వారా వారి జీవితాల్లో కొత్త మార్పులు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టుకు 1996 మార్చి 5న తాను ముఖ్యమంత్రిగా శంకుస్థాపన చేశానని చంద్రబాబు గుర్తు చేశారు. మూడు దశాబ్దాల తర్వాత అదే ప్రాజెక్టును తన చేతుల మీదుగా ప్రారంభించడం సంతోషకరమని పేర్కొన్నారు. ▶▶2

## బిహార్‌లో ఉద్రిక్తత పోలీసులు, విద్యార్థుల మధ్య ఘర్షణ..



బిహార్‌లో విద్యార్థుల నిరసనలు ఉద్రిక్తంగా మారాయి. బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బీపీఎస్సీ) 70వ పరీక్షలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ.. దానిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది విద్యార్థులు రోడ్డెక్కారు. పట్నాలోని గాంధీ మైదాన్ నుంచి సీఎం సమ్రాట్ చౌధరీ నివాసం వైపు ర్యాలీ చేపట్టారు. బారికేడ్లను దూకిన విద్యార్థులను పోలీసులు నిలువరించేందుకు యత్నించారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జి చేశారు. జల ఫిరంగులను ప్రయోగించారు. పలువురిని అదుపులోకి తీసుకున్నారు. పోటీ పరీక్షలు, నియామకాలకు సంబంధించిన వివిధ డిమాండ్లపై పట్నాలో విద్యార్థులు, ఉద్యోగార్థులు కొన్ని రోజులుగా నిరసనలు కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగానే ఈ ర్యాలీ నిర్వహించారు. సంబంధిత డిమాండ్లపై సోమవారమే విద్యార్థి ప్రతినిధులతో అధికారులు చర్చలు జరిపారు. అయితే.. ముఖ్యమంత్రి లేదా విద్యాశాఖ మంత్రితో చర్చలకు అనుమతించాలని విద్యార్థి ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. ఈ పరిణామాల నడుమ.. విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు 'విద్యార్థి సహయోగ శిబిరం' పేరుతో నెలవారీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. ప్రతి నెలా నాలుగో మంగళవారం విద్యాసంస్థల్లో ఈ శిబిరాలను నిర్వహిస్తామని, విద్యార్థులు తమ సమస్యలను అధికారులకు నేరుగా తెలియజేసే అవకాశం లభిస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. అదేవిధంగా 1100 హెల్ప్‌లైన్ నంబరు ద్వారా ఫిర్యాదులను నమోదు చేయొచ్చని తెలిపారు.

## స్థానిక ఎన్నికలపై జగన్ దిశానిర్దేశం

- స్వేచ్ఛగా ఎన్నికలు జరిగితే ప్రజా తీర్పు స్పష్టమని వ్యాఖ్య
- బలమైన అభ్యర్థులను బరిలోకి దింపాలని సూచన
- కేడర్ బలోపేతానికి గుర్తింపు కార్డుల పంపిణీ
- లీగల్, మీడియా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని పిలుపు



**రాజధాని వాయిస్ తాడేపల్లి, ఆగస్టు 25 :** స్థానిక సంస్థల ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగితే కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇస్తారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. పార్టీ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆయన రానున్న స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం చేస్తూ పలు కీలక సూచనలు చేశారు. ఈ ఎన్నికలు కేవలం గెలుపోటములకు సంబంధించినవి మాత్రమే కాదని, క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలకు అండగా నిలబడాల్సిన సమయం అని జగన్ పేర్కొన్నారు. గత ఎన్నికల్లో అధికార దుర్వినియోగం, దౌర్జన్యాలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ, ▶▶2

## పోలవరం జలహారతికి ఏర్పాట్లు

- ఉత్తరాంధ్ర రైతాంగానికి చారిత్రాత్మక ఘట్టం
- సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష
- ఎన్డీఏ నాయకులతో మంత్రి అనిత సమావేశం
- ఘన స్వాగతానికి ప్రత్యేక కార్యాచరణ



**విశాఖపట్నం, ఆగస్టు 25 :** పోలవరం ఎడమ కాలువ ద్వారా నీటి విడుదల ఉత్తరాంధ్ర రైతాంగానికి చారిత్రాత్మక ముందడుగుగా నిలుస్తుందని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. సెప్టెంబర్ తొలి వారంలో జరగనున్న జలహారతి కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్న నేపథ్యంలో సారిపల్లిపాలెంలో ఎన్డీఏ కూటమి ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా నీటి విడుదలతో ఉత్తరాంధ్ర ప్రాంత రైతులకు సాగునీటి అవకాశాలు మరింత మెరుగుపడనున్నాయని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని నిర్ణయించారు. స్థానిక ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులకు సూచించారు. జలహారతి కార్యక్రమం ద్వారా పోలవరం ప్రాజెక్టు ప్రాధాన్యతను ప్రజలకు మరింత చేరువ చేయనున్నట్లు తెలిపారు. రైతుల అభివృద్ధి, వ్యవసాయ రంగ బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రత, రవాణా, ప్రజల సౌకర్యాల విషయంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమం నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలవరం జలాలు ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త దారులు తెరవనున్నాయని మంత్రి అనిత తెలిపారు. జలహారతి కార్యక్రమాన్ని విజయవంతం చేసి రైతాంగానికి అంకితం చేయాలని ఎన్డీఏ కూటమి నాయకులకు పిలుపునిచ్చారు.

# రెబల్ ఎంపీలకు సుప్రీం నోటీసులు

జస్టిస్ విపుల్ ఎం. పంచోలిలతో కూడిన ధర్మాసనం ముందు ఈ కేసు విచారణకు వచ్చింది. టీఎంసీ తరఫున సమర్పించిన పిటిషన్‌లో, రెబల్ ఎంపీలపై అనర్హత పిటిషన్లు లోక్‌సభ స్పీకర్ వద్ద పెండింగ్‌లో ఉన్నప్పటికీ వాటిపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని కోర్టును కోరారు.లోక్‌సభ స్పీకర్ తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అనర్హత పిటిషన్లపై స్పీకర్ ఇప్పటికే నోటీసులు జారీ చేశారని ధర్మాసనానికి వివరించారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం, కేవలం నోటీసులు జారీ చేయడం మాత్రమే సరిపోదని, నిర్దిష్ట కాలపరిమితిలోగా విచారణ పూర్తి కావడం కూడా అవసరమని స్పష్టం చేసింది. పెండింగ్ అంశాలను నిరవధికంగా కొనసాగించరాదని వ్యాఖ్యానించింది. విచారణ సందర్భంగా స్పీకర్‌కు కూడా నోటీసులు జారీ చేయాలనే అభిప్రాయాన్ని ధర్మాసనం తొలుత వ్యక్తం చేసింది. అయితే స్పీకర్ రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్నారని, ఇప్పటికే ప్రక్రియ ప్రారంభమైందని సొలిసిటర్ జనరల్ చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. అనంతరం రెబల్ ఎంపీలకు నోటీసులు జారీ చేసి తదుపరి విచారణకు కేసును వాయిదా వేసింది.ఇటీవల టీఎంసీకి చెందిన 20 మంది లోక్‌సభ సభ్యులు త్రిపురకు చెందిన నేషనల్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియాలో విలీనమయ్యామని ప్రకటించారు. అనంతరం వారు జాతీయ ప్రజాస్వామ్య కూటమిలో చేరారు. ఈ పరిణామం తర్వాత పార్లమెంటులో వారిని ప్రత్యేక వర్గంగా గుర్తిస్తూ వ్యవహరిస్తున్నారు. అయితే టీఎంసీ గుర్తుపై ఎన్నికైన సభ్యులు మరో పార్టీలో చేరడం ద్వారా స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వాన్ని వదులుకున్నట్లేనని, అందువల్ల ఫిరాయింపుల నిరోధక చట్టం కింద వారిని అనర్హులుగా ప్రకటించాలని టీఎంసీ వాదిస్తోంది. మరోవైపు తమది చట్టబద్ధమైన విలీన ప్రక్రియేనని, రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగానే నిర్ణయం తీసుకున్నామని రెబల్ ఎంపీల వర్గం చెబుతోంది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు విచారణ రాజకీయంగా, న్యాయపరంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# స్థానిక ఎన్నికలపై జగన్ దిశానిర్దేశం

ఈసారి ప్రతి స్థానంలోనూ బలమైన, సమర్థులైన అభ్యర్థులను నిలబెట్టాలని నాయకులకు సూచించారు.ఏ నియోజకవర్గంలోనూ పోటీ లేకుండా ఏకగ్రీవాలకు అవకాశం ఇవ్వకూడదని జగన్ స్పష్టం చేశారు. అవసరమైతే నాయకులు తమ కుటుంబ సభ్యులను కూడా ఎన్నికల బరిలోకి దించేందుకు వెనుకాడవద్దని పిలుపునిచ్చారు. ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే అక్కడి సమన్వయకర్తల పనితీరును పార్టీ పరిశీలిస్తుందని హెచ్చరించారు. పార్టీ కేడర్ బలోపేతం కోసం 14 నుంచి 15 లక్షల క్యూఆర్ కోడ్ ఆధారిత గుర్తింపు కార్డులు సిద్ధమయ్యాయని తెలిపారు. సెప్టెంబరు 5 నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో సమావేశాలు నిర్వహించి వాటిని పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. గ్రామ స్థాయిలో పార్టీ ప్రచారాన్ని మరింత విస్తృతం చేయాలని సూచించారు.కార్యకర్తలకు న్యాయపరమైన సహాయం అందించేందుకు నియోజకవర్గ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు లీగల్, మీడియా విభాగాలను బలోపేతం చేయాలని జగన్ ఆదేశించారు. అవసరమైతే కేసులను ఉన్నత న్యాయస్థానాల వరకు తీసుకెళ్లేలా సమన్వయ వ్యవస్థను సిద్ధం చేయాలని చెప్పారు. సామాజిక మాధ్యమాలను సమర్థంగా వినియోగించుకోవాలని, డిజిటల్ వేదికల ద్వారా పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రాబోయే 60 నుంచి 70 రోజుల పాటు నాయకులు తమ నియోజకవర్గాల్లోనే ఉంటూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని జగన్ పిలుపునిచ్చారు.

# రాయదుర్గం నియోజకవర్గంలో సుజ్లాన్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు శంకుస్థాపన




హులికెరకు చేరుకున్న మంత్రి లోకేష్ కు సుజ్లాన్ కంపెనీ ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. అనంతరం సుజ్లాన్ 1,325 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులకు శంకుస్థాపనతో పాటు సుజ్లాన్ ఎస్144 న్యూ బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్ ను మంత్రి ప్రారంభించారు. శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన ఏవీని మంత్రి వీక్షించారు. అంతకుముందు బళ్లారి సమీపంలోని హాలకుంది గ్రామంలో సుజ్లాన్ బ్లేడ్ స్టాక్ యార్డును మంత్రి సందర్శించారు. సుజ్లాన్ ప్రతినిధులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విండ్ టర్బైన్ పై సంతకం చేశారు. సుజ్లాన్ సంస్థ ప్రస్తుతం 1,700కు పైగా మెగావాట్ల స్థాపిత సామర్థ్యంతో ఏపీలో అతిపెద్ద విండ్ భాగస్వామిగా అవతరించింది. 2030 నాటికి 5వేల మెగావాట్ల అదనపు పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల స్థాపన లక్ష్యంగా సుజ్లాన్ సంస్థ ప్రణాళికలు రూపొందించి, వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది.ఈ కార్యక్రమంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా జీ.లక్ష్మీనారాయణ, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకట ప్రసాద్, సుజ్లాన్ గ్రూప్ కో ఫౌండర్, వైస్ ఛైర్మన్ గిరీష్ తంతి, సీఈవో అజయ్ కపూర్, అడ్వైజర్ వీబీ రావు, టాటా పవర్ ఎండీ, సీఈవో సంజయ్ బంగా, సుజ్లాన్ గ్రూప్ డైరెక్టర్ రంజిత్ సిన్హా అభయ్ సిన్హా పర్మార్, ఎన్ఆర్ఈడీసీఏపీ లిమిటెడ్ వీసీ, మేనేజింగ్ డైరెక్టర్ ఎమ్.కమలాకర బాబు, టోరెంట్ పవర్ డైరెక్టర్ జిగీష్ మెహతా, వారీ ఎనర్జీస్ సీఎండీ హితేష్ దోషి, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పాల్గొన్నారు.

## శ్రీశైలంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఆత్మహత్య

శ్రీశైలం: శ్రీశైలంలోని వడ్డెర సత్రంలోని రూమ్ నెం.11లో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరిలో ఇద్దరు గదిలోని హాలులో ఫ్యాన్‌కు ఉరేసుకోగా, స్నానాల గదిలో ముగ్గురు మహిళలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. 3 రోజుల క్రితమే జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. సత్రంలోని గది నుంచి దుర్వాసన వస్తుండటంతో నిర్వాహకులు వెళ్లి చూడగా మృతదేహాలు కనిపించాయి. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. ఆత్మకూరు డీఎస్పీ రామాంజనేయులు ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. ఘటనపై శ్రీశైలం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దాదాపు నెల రోజుల నుంచి వీరంతా వడ్డెరసత్రంలో బస చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

మృతులు శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లికి చెందిన పల్లపు సుధాకర్(36), మల్లేశ్వరి(45), శ్రీదేవి(33), గోగుల ఆదిలక్ష్మి(50), మణికంఠ(15)గా గుర్తించారు. ఆర్థిక ఇబ్బందులే వీరి ఆత్మహత్యకు కారణమని అనుమానిస్తున్నారు. "గత నెల 28న సుధాకర్‌తో పాటు ఆయన ముగ్గురు తోబుట్టువులు, మేనల్లుడు శ్రీశైలం వచ్చారు. రోజుకు రూ.800 అద్దె చెల్లిస్తూ వడ్డెర సత్రం గదిలో ఉంటున్నారు. ఇన్ని రోజులు ఉండకూడదన్నా.. ఆరోగ్యం బాగాలేదంటూ కొనసాగారు. బత్తలపల్లికి చెందిన సుధాకర్, ఆయన చెల్లెళ్లు, మేనల్లుడు ఉరేసుకున్నారు. సుధాకర్‌కు ఇంకా వివాహం కాలేదు. ఇద్దరు చెల్లెళ్లకు పెళ్లి చేసినా భర్తలను వదిలేసి ఇంటి వద్దే ఉంటున్నారు. వీరికి ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నట్టు తెలుసుకున్నాం. ఆర్థిక ఇబ్బందుల వల్లే ఆత్మహత్యకు పాల్పడ్డారు. బత్తలపల్లిలోని వారి బంధువులకు సమాచారం ఇచ్చాం. ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం" అని డీఎస్పీ తెలిపారు.శ్రీశైలంలో ఐదుగురు ఆత్మహత్య ఘటనపై ఆలయ ఛైర్మన్ రమేష్ నాయుడు, ఈవో శ్రీనివాసరావు స్పందించారు. ఐదుగురు ఆత్మహత్యకు పాల్పడటం బాధాకరమన్నారు. వసతి గదుల్లో భక్తుల బసకు 48 గంటలే అనుమతి ఉందన్నారు. కానీ, సత్రం నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘించి గదులు కేటాయించారన్నారు. ప్రైవేటు సత్రాలన్నీ నిబంధనల ప్రకారం గదులు కేటాయించాలని ఆదేశించారు. మరో వైపు వడ్డెర సత్రం నిర్వహణ వివాదాస్పదంగా మారింది. సత్రాన్ని గతంలో దేవస్థానం అధికారులు సీజ్ చేయగా.. హైకోర్టు ఉత్తర్వులతో యాజమాన్యం మళ్లీ నిర్వహణ చేపట్టింది. సత్రం వరుస వివాదాలపై విచారణ చేస్తున్నట్టు ఆలయ ఛైర్మన్, ఈవో వెల్లడించారు.

# వెలిగొండ జలాలతో కరువుకు చెక్ : సీఎం



ప్రాజెక్టు ఫేజ్-1 ప్రారంభంతో 10.7 టీఎంసీల నీటిని నల్లమల సాగర్‌కు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ప్రాజెక్టు మొదటి దశ ద్వారా 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుండగా, రెండో దశ పూర్తయిన తర్వాత మొత్తం 3.283 లక్షల ఎకరాలకు నీటి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. అలాగే లక్షలాది మందికి తాగునీరు అందించడంతో పాటు తరతరాలుగా కరువుతో పోరాడుతున్న ప్రజలకు శాశ్వత ఉపశమనం కలిగించడమే లక్ష్యమన్నారు. మార్కాపురం ప్రాంతానికి వెలిగొండ ప్రాజెక్టు అభివృద్ధికి కొత్త వెలుగులు తీసుకురానుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. కృష్ణా జలాలతో కరువు నేలను సస్యశ్యామలం చేసి రైతుల జీవితాల్లో కొత్త ఆశలు నింపనున్నట్లు చెప్పారు. ఈ జలాలతో సాగు, తాగునీటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.పశ్చిమ ప్రకాశం ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని చంద్రబాబు తెలిపారు. మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చామని చెప్పారు. రాయలసీమ, ఉమ్మడి ప్రకాశం జిల్లాలను ఉద్యానవన పంటల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులతో కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. బెంగుళూరు--అమరావతి జాతీయ రహదారి, రామాయపట్నం పోర్టు వంటి ప్రాజెక్టులతో ఈ ప్రాంతంలో వాణిజ్య, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయని తెలిపారు. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించి ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని స్పష్టం చేశారు. ప్రతి రైతు పొలానికి నీరు, ప్రతి యువకుడికి ఉపాధి, ప్రతి కుటుంబానికి భరోసా కల్పించడమే ప్రభుత్వ సంకల్పమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# ప్రపంచస్థాయి సౌకర్యాల కల్పనకు సీఎం ఆదేశాలు



పాటు పర్యాటక అభివృద్ధికి కూడా పుష్కరాలు వేదిక కావాలని అభిప్రాయపడ్డారు. ఇందుకోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.పుష్కరాల నిర్వహణలో స్థానిక ప్రజలను భాగస్వాములను చేయాలని చంద్రబాబు సూచించారు. ఘాట్‌ల నిర్వహణ, పరిశుభ్రత, సందర్శకులకు మార్గనిర్దేశం, సేవా కార్యక్రమాల్లో స్థానిక యువత, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యాన్ని పెంచాలని పేర్కొన్నారు. ప్రజల సహకారంతో పుష్కరాలను మరింత విజయవంతంగా నిర్వహించే అవకాశం ఉంటుందని అన్నారు. పుష్కరాలకు సంబంధించి రూ.4,026 కోట్ల వ్యయంతో చేపట్టిన 4,932 అభివృద్ధి పనుల పురోగతిని సీఎం సచివాలయంలో సమీక్షించారు. రహదారులు, ఘాట్‌ల అభివృద్ధి, తాగునీటి సౌకర్యాలు, పారిశుద్ధ్య వ్యవస్థలు, విద్యుత్, వసతి కేంద్రాలు, ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా అన్ని పనులు పూర్తి కావాలని స్పష్టం చేశారు.భద్రతా ఏర్పాట్లకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించారు. భారీ జనసందోహాన్ని దృష్టిలో ఉంచుకుని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని, పర్యవేక్షణ వ్యవస్థలను బలోపేతం చేయాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేలా వైద్య బృందాలు, సహాయక కేంద్రాలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, బీసీ జనార్ధన్ రెడ్డి, వై సత్యకుమార్ యాదవ్, గోదావరి పుష్కరాల ప్రత్యేకాధికారి, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పుష్కరాల నిర్వహణకు సంబంధించి చేపడుతున్న పనులపై సీఎం వివిధ శాఖల అధికారులతో సమగ్రంగా చర్చించి, భక్తులకు అత్యుత్తమ సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు.

# ఏపీ-యూకే మధ్య కీలక ఒప్పందం



స్థాయి నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక మౌలిక సదుపాయాల కల్పనకు ఈ ఒప్పందం దోహదపడనుందని మంత్రి వివరించారు. పట్టణ ప్రణాళిక, రవాణా వ్యవస్థలు, వ్యర్థాల నిర్వహణ, నీటి సరఫరా, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో యూకే ప్రభుత్వ అనుభవాన్ని వినియోగించుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. దీంతో రాష్ట్ర పట్టణాల అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని అభిప్రాయపడ్డారు.ప్రత్యేకించి అమరావతిని ప్రపంచస్థాయి స్మార్ట్, నివాసయోగ్య నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ భాగస్వామ్యం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని నారాయణ తెలిపారు. నగర ప్రణాళిక, సుస్థిర అభివృద్ధి, హరిత మౌలిక వసతులు, డిజిటల్ సేవల విస్తరణలో యూకే నిపుణుల సాంకేతిక సహకారం లభించనుందని వెల్లడించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అమరావతి అభివృద్ధికి ఈ ఒప్పందం కొత్త ఊపునిస్తుందని పేర్కొన్నారు. ఈ అవగాహన ఒప్పందం ద్వారా పట్టణాల అభివృద్ధికి అవసరమైన ఆధునిక విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడుల అవకాశాలపై పరస్పర సహకారం పెరుగుతుందని అధికారులు తెలిపారు. నగరాల నిర్వహణలో సమర్థవంతమైన విధానాలు అమలు చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై దృష్టి సారించనున్నట్లు చెప్పారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పట్టణాలను రూపుదిద్దేందుకు ఈ భాగస్వామ్యం తోడ్పడుతుందని పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన నగరాలు, అభివృద్ధి చెందుతున్న పట్టణాలకు దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడంలో కూడా యూకే సహకారం అందించనుంది. సుస్థిర నగరాభివృద్ధి, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించే ప్రణాళికలు, ప్రజా రవాణా వ్యవస్థల మెరుగుదల వంటి అంశాల్లో ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు సమాచారం. దీనివల్ల పట్టణ జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్రాన్ని ఆధునిక పట్టణాభివృద్ధి రంగంలో దేశంలోనే ఆదర్శంగా నిలపాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి నారాయణ తెలిపారు. అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా ప్రపంచ స్థాయి అనుభవాలను రాష్ట్రానికి తీసుకురావడం, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ ఒప్పందం రాష్ట్ర పట్టణాభివృద్ధి చరిత్రలో ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆయన అభివర్ణించారు.

# విమాన పైలట్లకు ఇకపై ఏటా డోప్ టెస్టులు..!



ఇకపై ఏడాదికి ఒక్కసారైనా విమాన పైలట్లకు డోప్ టెస్టులు నిర్వహించాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ప్రస్తుతం మొత్తం పైలట్ల సంఖ్యలో 10 శాతం మందికి మాత్రమే డోప్ టెస్టులు నిర్వహించాలనే నిబంధన అమల్లో ఉందని చెప్పారు. ఏడాదిలో ఒకసారి ప్రతి పైలట్‌కూ పరీక్ష నిర్వహించేలా దీనిని మార్పు చేయాలనే అంశాన్ని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ పరిశీలిస్తోందన్నారు. భద్రత, నిర్వహణపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకొని దీనిపై ఓ నిర్ణయం తీసుకుంటామన్నారు. మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించిన ప్రస్తుత నిబంధనలను మరింత కఠినం చేసే మార్గాలపైనా డీజీసీఏ అధ్యయనం చేస్తోందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇటీవల జరిగిన ఎయిర్ ఇండియా పుకెట్-దిల్లీ విమాన ఘటనపై మాట్లాడుతూ.. దీనిపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో దర్యాప్తు చేస్తోందన్నారు. విమానంలోని ఫ్లైట్ డేటా రికార్డర్ దర్యాప్తు సంస్థ ఆధీనంలో ఉందని పేర్కొన్నారు. త్వరలోనే ప్రాథమిక నివేదిక వచ్చే అవకాశం ఉందని.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. థాయ్‌లాండ్ నుంచి దిల్లీకి వస్తున్న విమానం ఆగస్టు 4న తీవ్ర కుదుపులకు లోనైన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 17 మంది గాయపడ్డారు. ఈ ఘటన అనంతరం పైలట్లు ఇద్దరికీ డ్రగ్ టెస్ట్ నిర్వహించారు. తొలి పరీక్షలో పైలట్-ఇన్- కమాండ్‌కు పాజిటివ్ వచ్చింది. దీని తర్వాత సైకోయాక్టివ్ పరీక్ష నిర్వహించగా.. గంజాయి సేవించినట్లు నిర్ధరణ అయ్యింది.

# ఈనెల 27,28 తేదీల్లో అసెంబ్లీ పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ సమావేశం

**రాజధాని వాయిస్ అమరావతి,ఆగస్టు 25:**ఈనెల 27,28 తేదీల్లో అసెంబ్లీ కమిటీ హాల్లో ఆంధ్రప్రదేశ్ శాసన సభ పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ సమావేశం కానుందని అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న కుమార్ తెలియజేశారు.వాస్తవానికి ఈకమిటీ సమావేశం ఈనెల 26,27 తేదీల్లో జరగాల్సి ఉండగా 26వతేదీ మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ప్రభుత్వ సెలవు దినం కావడంతో ఈసమావేశాన్ని ఈనెల 27,28 తేదీలకు మార్పు చేశారు. ఈకమిటీ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ రంగ సంస్థల(పబ్లిక్ అండర్ టేకింగ్స్(పిఎస్ యులు)కు సంబంధించి గత ఐదేళ్ళ వార్షిక నివేదికలు మరియు జనరల్ యాక్టివిటీలను సమీక్షించ నుందని పేర్కొన్నారు.27వ తేది గురువారం ఉ.10గం.లకు అసెంబ్లీ కమిటీ హాల్ 1లో సమగ్ర శిక్ష,ఎపి అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజిమెంట్ లిమిటెడ్ లపైన,మధ్యాహ్నం 2గం.లకు ఎపి స్టేట్ డిజాస్టర్ మేనేజిమెంట్ అథారిటి పైన తదుపరి ఎపి ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఎపిఇడబ్ల్యుఐడిసి)లపైన అసెంబ్లీ కమిటీ సమీక్షిస్తుందని సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ తెలియజేశారు.28వ తేది ఉ.10గం.లకు ఎపి ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(ఎపిఐఐసి),ఎపి స్టేట్ రోడ్డు రవాణా సంస్థ(ఎపిఎస్ఆర్టీసి),ఎపి స్టేట్ హేండ్ లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటి (ఆప్కో)లపై కమిటీ సమీక్షిస్తుందన్నారు.అదే విధంగా మధ్యాహ్నం 2గం.ల నుండి ఎపి ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు(ఎపి కెవిఐబి),ఎపి స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ లపై సమీక్షిస్తుందని తెలిపారు.

# తాటి వనం.. తీరానికి రక్షణ కవచం

**ప్రజల భాగస్వామ్యంతో తాటి వనాల అభివృద్ధి: పవన్ కల్యాణ్**



**రాజధాని వాయిస్ విజయవాడ, ఆగస్టు 25:** ఆంధ్రప్రదేశ్ సుదీర్ఘ తీర ప్రాంతానికి సహజ రక్షణ కవచం ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో చేపట్టిన 'గ్రేట్ గ్రీన్ వాల్'లో కీలకమైన తాటి వనాల ఏర్పాటుకు అటవీ శాఖ శ్రీకారం చుట్టింది. తాటి కాయల సీజన్ ప్రారంభం కావడంతో తాటి గింజల సేకరణ, నాటే కార్యక్రమాలను ప్రారంభించింది.గ్రేట్ గ్రీన్ వాల్ మూడంచెల ప్రణాళికలో మొదటి అంచెగా మడ అడవులు, రెండో అంచెగా తాటి వనాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. తుపాన్లు, తీవ్ర గాలుల సమయంలో తీర ప్రాంత గ్రామాలకు తాటి చెట్లు సహజ గాలి నిరోధక వ్యవస్థగా పనిచేస్తాయని అధికారులు పేర్కొన్నారు.

తీర ప్రాంతాల్లోని ఉప్పు నేలలు, ఇసుక, బుసకతో కూడిన ఒండ్రు నేలల్లోనూ తాటి చెట్లు పెరిగే సామర్థ్యం కలిగి ఉంటాయి. బలమైన వేర్లతో నేలను గట్టిగా పట్టుకుని ఉండటం వల్ల తీర కోతను అడ్డుకోవడంలోనూ ఇవి దోహదపడతాయి. పక్షులు, సరిసృపాలకు ఆవాసంగా నిలుస్తూ జీవ వైవిధ్య పరిరక్షణకు తోడ్పడతాయి. వాతావరణ మార్పుల ప్రభావాలను తట్టుకునే సామర్థ్యం కూడా తాటి చెట్లకు ఉందని అటవీ శాఖ తెలిపింది.

# కారంపూడిలో నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలల పేర్ల మార్పు?

**తల్లిదండ్రులను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ ఆరోపణలు**

**విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్**



**కారంపూడి.ఆగస్టు 25 రాజధాని వాయిస్ :** రాష్ట్రంలో విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుండగా, క్షేత్రస్థాయిలో మాత్రం నిబంధనల ఉల్లంఘనలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. కారంపూడి మండల పరిధిలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు అధికారిక గుర్తింపు పేర్లను కాదని, నిబంధనలకు విరుద్ధంగా ప్రముఖ బ్రాండ్ల పేర్లతో బోర్డులు ఏర్పాటు చేసి ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**ప్రచారం ఒక పేరుతో.. అనుమతులు మరో పేరుతో**

మండల పరిధిలో పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అనుమతి పొందిన పేరుతో కాకుండా, విద్యార్థులను ఆకర్షించేందుకు పెద్ద కార్పొరేట్ విద్యాసంస్థల పేర్లను వాడుకుంటున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అసలు విషయం తెలియని గ్రామీణ ప్రాంతాల తల్లిదండ్రులు ఆ ప్రచారాన్ని నమ్మి తమ పిల్లలను చేర్పిస్తూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మరోవైపు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నారనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి.

**అధికారుల పర్యవేక్షణ లోపమా**

ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు వివరాలు, బోర్డులపై పేర్ల మార్పు తదితర అంశాలపై మండల విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపించిందని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అలసత్వం వల్లే యాజమాన్యాలు నిబంధనలు గాలికి వదిలేస్తున్నారని ఆరోపిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించి తప్పుదోవ పట్టించే ప్రచారాలు చేస్తున్న పాఠశాలలపై సమగ్ర విచారణ జరిపి, తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# మండలి డిప్యూటీ చైర్మన్ తూమాటి మాధవరావును సన్మానించిన వైఎస్సార్‌సీపీ నేతలు



**గుంటూరు.ఆగస్టు 25రాజధాని వాయిస్ :**ఆంధ్రప్రదేశ్ శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా ఎన్నికైన తూమాటి మాధవ రావును గుంటూరులోని పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు నివాసంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పీఏసీ సభ్యుడు, వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, తెనాలి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, నియోజకవర్గ సమన్వయకర్తలు కరణం వెంకటేష్ చీరాల, చింతలపూడి అశోక్ కుమార్ అద్దంకి, చుండూరు రవికుమార్ ఒంగోలు, దేవభక్తుని చక్రవర్తి పెనమలూరు, దేవినేని అవినాష్ విజయవాడ పశ్చిమ, తన్నీరు నాగేశ్వరరావు జగ్గయ్యపేట తదితరులు పాల్గొని మాధవరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

# మంత్రి అనిత సమీక్షలో జలహారతి ఏర్పాట్లు



**రాజధాని వాయిస్ పాయకరావుపేట :** పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలు ఉత్తరాంధ్ర పంట పొలాలకు చేరుకోవడం చారిత్రాత్మక ఘట్టమని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. వచ్చే నెలలో నిర్వహించనున్న జలహారతి కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్న నేపథ్యంలో కాలువ నీటి విడుదల ప్రాంతాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశమై కార్యక్రమ ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ప్రజా భాగస్వామ్యంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ ఉత్తరాంధ్ర రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సాగునీటి కల ఇప్పుడు సాకారమవుతోందన్నారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలు చేరడం వల్ల వ్యవసాయ రంగంలో కొత్త అధ్యాయం ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ నీటి సరఫరాతో రైతుల ఆదాయం పెరగడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తి కూడా గణనీయంగా వృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. పాయకరావుపేట ప్రాంతంలో సుమారు 35 వేల ఎకరాలకు సాగునీరు అందుబాటులోకి రానుందని మంత్రి తెలిపారు. సాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఇది గొప్ప ఊరటనివ్వనుందని పేర్కొన్నారు. నీటి లభ్యత పెరగడం వల్ల పంటల సాగు విస్తీర్ణం పెరిగి రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆమె చెప్పారు. పోలవరం జలాలతో తాండవ, వరాహ, శారదా నదులు కూడా జలకళను సంతరించుకోనున్నాయని మంత్రి అనిత తెలిపారు. ఈ నదుల పరివాహక ప్రాంతాల్లో వ్యవసాయం, తాగునీటి అవసరాలకు మరింత ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు అందించడం ద్వారా ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జలహారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అవసరమైన మౌలిక వసతులు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమం ఉత్తరాంధ్ర చరిత్రలో చిరస్మరణీయ ఘట్టంగా నిలిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉత్తరాంధ్ర రైతాంగం ఎన్నో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న గోదావరి జలాల ప్రవాహం ఇప్పుడు వాస్తవ రూపం దాల్చడం ఆనందదాయకమని మంత్రి అనిత పేర్కొన్నారు. రైతుల సంక్షేమం, సాగునీటి విస్తరణ, ప్రాంతీయ అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. గోదావరి జలాలకు ఉత్తరాంధ్ర ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నారని, ఈ చారిత్రాత్మక సందర్భం ప్రాంత అభివృద్ధికి దిశను చూపుతుందని మంత్రి అన్నారు.

# నెల్లిమర్లలో అభివృద్ధి పనులపై సమీక్ష

**- ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశం - పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, సాగునీటి శాఖల పనుల సమీక్ష - పూర్తయిన పనుల బిల్లుల చెల్లింపులు వేగవంతం చేయాలని ఆదేశం**

**నాణ్యతతో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచన**







**రాజధాని వాయిస్ నెల్లిమర్ల, ఆగస్టు 25 :** నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన వివిధ శాఖల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అధికారులను ఆదేశించారు. పంచాయతీ రాజ్, రహదారులు మరియు భవనాలు, సాగునీటి శాఖల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై మంగళవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఆయా శాఖల అధికారులు తమ పరిధిలో చేపడుతున్న పనుల వివరాలను ఎమ్మెల్యేకు నివేదించారు. సమావేశ ంలో ఇప్పటికే పూర్తయిన అభివృద్ధి పనుల నాణ్యతను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హమైన బిల్లుల చెల్లింపులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు సమయానికి బిల్లులు అందేలా చర్యలు తీసుకోవడం ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా సాగుతాయని పేర్కొ న్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులు ఆలస్యం కాకుండా చూడా లని అధికారులకు సూచించారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న రహదారులు, కల్వర్టులు, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా వ్యవస్థలకు సంబంధించిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా సాంకేతిక లేదా పరిపాలనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనుల అమలులో వేగం పెంచాలని సూచించారు. కొత్తగా మంజూరైన రహదారి ప్రాజెక్టు లు, చెరువుల పునరుద్ధరణ పనులు, పంచాయతీ భవనాల నిర్మాణా లకు సంబంధించిన టెండర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

టెండర్లు ఖరారైన వెంటనే పనులను భూమి స్థాయిలో ప్రారంభించి అభివృద్ధి ఫలితాలు ప్రజల కు కనిపించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి పనికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక ఉండాలని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పనులు త్వరగా పూర్తవ్వడం ఎంత ముఖ్యమో, నాణ్యతా ప్రమాణాలు పాటించడం కూడా అంతే ముఖ్యమని తెలిపారు. నాసిరకం పనులకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా సంబంధిత అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచిం చారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి పిలుపునిచ్చారు. అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలై తేనే ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొన్న అధికారులు పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# తిరుపతిలో విద్యార్థినుల భద్రతపై అవగాహన

**- మహిళా పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక సదస్సు - శ్రీ పద్మావతి పాలిటెక్నిక్ కళాశాలలో కార్యక్రమం**

**- మహిళలు, చిన్నారులపై నేరాలపై చైతన్యం - సైబర్ మోసాల నుంచి అప్రమత్తంగా ఉండాలని సూచన**





**రాజధాని వాయిస్ తిరుపతి, ఆగస్టు 25 :** విద్యార్థినుల భద్రతే లక్ష్యంగా తిరుపతి జిల్లా పోలీస్ శాఖ విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. తిరుపతిలోని శ్రీ పద్మావతి పాలిటెక్నిక్ మహిళా కళాశాలలో మహిళా పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించి విద్యార్థినులకు భద్రతా అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు వివరించారు. అనుమానాస్పద సంఘటనలు ఎదురైన ప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించా రు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలు, సేవల గురించి అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు రోజురో జుకు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థినులు మరింత అప్రమత్తం గా ఉండాలని పోలీసులు సూచించారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే సందేశాలు, లింకులు, ఫోన్ కాల్స్ పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల వినియోగంలో పాటించా ల్సిన జాగ్రత్తలను కూడా వివరించారు. ఆన్‌లైన్ వేధింపులు, మోసాలు, నకిలీ ఖాతాల ద్వారా జరిగే నేరాలపై అవగాహన కల్పిస్తూ, సమస్యలు ఎదురైతే వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యార్థినులు తమ హక్కులు, భద్రతా చట్టాల గురించి తెలుసుకోవడం అవసరమని మహిళా పోలీసులు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించాల్సిన సహాయవాణి సేవలు, పోలీసు అత్యవసర స్పందన వ్యవస్థల గురించి కూడా వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు. మహిళల భద్రత, సైబర్ భద్రతపై ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో చైతన్యం పెంచేందుకు దోహదపడతాయని అధికారులు తెలిపారు.

# రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్

**- స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చర్యలు**

**- కొండాపురం సీఐ ఆధ్వర్యంలో కార్యక్రమం**

**- శాంతిభద్రతల పరిరక్షణపై సూచనలు**

**- చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరిక**



**రాజధాని వాయిస్ కడప :** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కొండాపురం సీఐ రాజా ఆధ్వర్యంలో వెంకయ్య కాల్వ ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామానికి చెందిన రౌడీషీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రౌడీషీటర్లతో సమావేశమైన పోలీసులు ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడరాదని సూచించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు, బెదిరింపులు, గొడవలు, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను గౌరవిస్తూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని సూచించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచనున్నట్లు పోలీసులు తెలిపారు. అనుమానాస్పద కదలికలు లేదా సమస్యలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని గ్రామస్తులకు సూచించారు. రౌడీషీటర్లను చట్టబద్ధమైన జీవన విధానాన్ని అనుసరించాలని, సమాజంలో మంచి పౌరులుగా మెలగాలని కౌన్సెలింగ్‌లో వివరించారు. వ్యక్తిగత, సామాజిక బాధ్యతలను గుర్తించి ప్రశాంతతకు భంగం కలిగించకుండా ఉండాలని సూచించారు. కౌన్సెలింగ్ కార్యక్రమంలో పోలీసు అధికారులు పాల్గొని శాంతి, భద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ అన్ని చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు.

# సెప్టెంబర్ 4లోగా డోర్ టు డోర్ పూర్తి చేయాలి

**- పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచన**

**- సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు**

**- గుడివాడ అభివృద్ధికి సమష్టిగా పనిచేయాలన్న ఎమ్మెల్యే**

**- మౌలిక వసతుల అభివృద్ధికి రూ.50 కోట్ల ప్రణాళిక**





**రాజధాని వాయిస్ గుడివాడ :** గుడివాడ పట్టణంలో నిర్వహి స్తున్న తెలుగుదేశం పార్టీ 'డోర్ టు డోర్' కార్యక్రమాన్ని సెప్టెంబర్ 4వ తేదీలోగా పూర్తి స్థాయిలో నిర్వహించాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పార్టీ వార్డు కమిటీలు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లకు సూచించారు. ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. గుడివాడ ఏలూరు రోడ్డులోని ప్రజా వేదిక కార్యాలయంలో మంగళ వారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పార్టీ నాయకులతో సమీక్ష నిర్వహించారు. బూత్‌ల వారీగా కొనసాగుతున్న డోర్ టు డోర్ కార్యక్రమం పురోగతి, సర్వే నివేదికలు, ప్రజల నుంచి వస్తున్న సమస్యలపై చర్చించారు. కార్యక్రమం ఇంకా పూర్తి కాని ప్రాంతాల్లో వేగం పెంచాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గుడివాడలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల గురించి ప్రతి ఇంటికీ వివరించాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. గుడివాడ అభివృద్ధే అందరి లక్ష్యమని పేర్కొన్న ఎమ్మెల్యే, నాయకులు, కార్యకర్తలు, కూటమి భాగస్వామ్య పక్షాలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పార్టీ శ్రేణుల ఐక్యతను రాష్ట్ర స్థాయి నాయకత్వం కూడా అభినందిస్తోందని తెలిపారు. టిడ్కో కాలనీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల, పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ అంశాలపై సంబంధిత శాఖలతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. గుడివాడ పట్టణంలో రోడ్లు, వీధి దీపాలు, పార్కుల అభివృద్ధికి సుమారు రూ.50 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు వెనిగండ్ల రాము వెల్లడించారు. ప్రధాన రహదారులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడంతో పాటు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# సాగర్ జలాలను త్రాగు నీటికి మాత్రమే వినియోగించాలి

**- జాయింట్ కలెక్టర్ సంజనా సింహ**



**నరసరావుపేట.ఆగస్టు 25,రాజధాని వాయిస్:** నాగార్జున సాగర్ కుడి కాలువ నుండి రెండు వేల క్యూసెక్కుల నీటిని ఆగస్ట్ 26 న ఉదయం 10 గంటలకు త్రాగు నీటిని విడుదల చేస్తున్నందున పల్నాడు జిల్లాలోని కాలువ పక్కన ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంయుక్త కలెక్టర్ సంజనా సింహ తెలిపారు.మంగళవారం సాయంత్రం జిల్లాలోని అన్ని మండల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, నీటిపారుదల అధికారులతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్లో సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ బుధవారం ఉదయం నాగార్జున సాగర్ నుండి త్రాగునీరు విడుదల చేస్తున్నందున గ్రామాల్లోని ఎస్ ఎస్ ట్యాంకులు నింపాలని, ఆ నీటిని ఎట్టి పరిస్థితుల్లో సాగుకు వినియోగించరాదని, కాలువ ప్రక్కన గ్రామాల వారు సాగుకు వినియోగించకుండా త్రాగునీటి అవసరాలకు వాడే విధంగా చెరువులు నింపాలని, గ్రామాల్లోని వీఆర్వోలు, ఎంపీడీవోలు ,పోలీస్ , రెవిన్యూ సిబ్బంది నిరంతరం కాలువ వెంబడి పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు.ఆర్ డబ్ల్యు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ,గ్రౌండ్ వాటర్, పంచాయతీ అధికారులు కాలువ ప్రక్కన ఉన్న గ్రామ ప్రజలను అప్రమత్తం చేయాలని, ఎవరు కాలవల్లోకి దిగరాదని, పశువులను వదల రాదని, పిల్లలు కాలువలోకి వెళ్లకుండా చూడాలని, కాలువ లో నీటి ప్రవాహం ఉధృతంగా ఉంటుందని పిల్లలు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# పంట నమోదుకు సెప్టెంబర్ 15 చివరి గడువు

**- పల్నాడు వ్యవసాయ శాఖ అధికారి ఎం.జగ్గారావు**



**రాజుపాలెం.ఆగస్టు 25,రాజధాని వాయిస్:** మండలం లోనిపెద నెమలిపురిగ్రామంలో పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఎం. జగ్గారావు క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ, పంట వేసిన ప్రతి ఒక్క రైతు కూడా తమ పంట వివరాలను ఇ-క్రాప్ నమోదు చేయించుకోవడంతో పాటు,తప్పనిసరిగా ఏపీఎఫ్ఆర్ (రైతు నమోదు) కూడా చేయించుకోవాలని స్పష్టం చేశారు.2026 సెప్టెంబర్ 15న పంట నమోదుకు ఆఖరు అని, ఈ గడువు ఎట్టి పరిస్థితుల్లోనూ పొడిగించబడదని గుర్తు చేశారు. రైతు నమోదు అవ్వకపోతే ప్రభుత్వ పథకాలు ఏవీ అందవని, నమోదు లేని రైతులకు పంటల బీమా, సున్నా వడ్డీ రుణాలు, పెట్టుబడి రాయితీ, కనీస మద్దతు ధర వంటి ప్రభుత్వ ప్రయోజనాలు వర్తించవని స్పష్టం చేశారు.అదేవిధంగా క్షేత్రస్థాయి వ్యవసాయ సిబ్బందికి జిల్లా వ్యవసాయ అధికారి కీలక ఆదేశాలు జారీ చేశారు.పరిధిలోని రైతు భరోసా కేంద్రాల (ఆర్ఎస్కే) ఇన్చార్జ్లు అందరూ రైతు నమోదు ఇ-క్రాప్ నమోదు ప్రక్రియలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.నిర్దేశిత గడువు లోపల తమ పరిధిలోని అన్ని భూముల వివరాల యొక్క నమోదు ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా శాఖాపరమైన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కావున రైతులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించి గడువు లోపల నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి. వెంకట నరసయ్య రైతు భరోసా కేంద్రాల సిబ్బందితదితరులు పాల్గొన్నారు.

# నెట్జీరో లక్ష్య సాధనకు పరిశుభ్రతే తొలి అడుగు ప్రిన్సిపాల్ హేమాంబర రెడ్డి




**విజయపురిసౌత్.ఆగస్టు 25 రాజధాని వాయిస్:** ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.హేమా ంబర రెడ్డి ఆధ్వర్యంలో ఎన్.యస్.యస్.యూనిట్ సమన్వయంతో సోమవారం కళాశాల ప్రాంగణంలో బోధనా, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు మరియు పారిశుద్ధ్య సిబ్బందితో కళాశాల ప్రాంగణంలోని వివిధ ప్రాంతాల్లో పరిశుభ్రతా కార్యక్రమాన్ని నిర్వహించి, చెత్తాచెదారం మరియు ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. సేకరించిన వ్యర్థాలను వేర్వేరు డస్ట్బిన్ లలో వేసి,వ్యర్థాల విభజన మరియు సరైన నిర్వహణపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ హేమాంబ రెడ్డి మాట్లాడుతూ,పరిశుభ్రమైన క్యాంపస్ -- పచ్చని క్యాంపస్ -- నెట్జీరో వైపు అడుగులు"అనే సందేశంతో నెట్జీరో లక్ష్య సాధనలో భాగంగా ఇటువంటి పర్యావరణ, పరిశుభ్రత మరియు అవగాహన కార్యక్రమాలను ప్రతి నెలా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి పరిశుభ్రతను తన బాధ్యతగా భావించి, కళాశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు.పరిశుభ్రతను నిరంతరం కాపాడటంలో కీలకపాత్ర పోషిస్తున్న పారిశుద్ధ్య సిబ్బందిని ప్రత్యేకంగా అభినం దించి, వారి సేవలను గుర్తించాలని విద్యార్థులు, సిబ్బంది మరియు పారిశుద్ధ్య సిబ్బంది సమన్వయంతోనే పరిశుభ్రమైన మరియు ఆరోగ్యకరమైన క్యాంపస్ సాధ్యమవుతుందని ఆయన,పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎన్.యస్.యస్.యూనిట్ బోధనా మరియు బోధనేతర సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# మీ ఓటు--మీ హక్కు అర్హులందరూ ఓటరుగా నమోదు కావాలి అక్కయ్య బుట్టి



**మాచర్ల.ఆగస్టు 25 రాజధాని వాయిస్** 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని తెలుగుదేశం పార్టీ మాచర్ల నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు అక్కయ్య బుట్టి పిలుపునిచ్చారు.మీ ఓటు--మీ హక్కుఅని పేర్కొంటూ,ఓటు హక్కు పొందడం ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధ హక్కు అని ఆయన తెలిపారు.కొత్త ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైందని,2008 అక్టోబర్ 1వ తేదీ లేదా అంతకుముందు జన్మించిన వారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అర్హులని అక్కయ్య బుట్టి తెలిపారు.అర్హత కలిగిన యువత,ప్రజలు ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత గడువులోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.ఓటరు నమోదుకు ఆధార్ కార్డు,జనన ధ్రువీకరణ పత్రం, పదో తరగతి సర్టిఫికెట్,రెండు పాస్పోర్ట్ సైజు ఫొటోలు, కుటుంబ సభ్యుల్లో ఒకరి ఓటరు గుర్తింపు కార్డు వంటి పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు.సమీపంలోని గ్రామ,వార్డు సచివాలయం,మీ-సేవ కేంద్రం ద్వారా లేదా ఆన్లైన్లో (ఎన్ విఎస్) పి సేవలను ఉపయోగించి ఓటరుగా నమోదు చేసుకోవచ్చని చెప్పారు.2026 ఆగస్టు 31వ తేదీని ఆఖరి తేదీగానిర్ణయించినందున,అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వెంటనే ఓటరుగా నమోదు చేసుకోవాలని అక్కయ్య బుట్టి కోరారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత కీలకమైన హక్కు అని,ప్రతి పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా రాజ్యాంగబద్ధ పాలనకు తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఆర్ ఆర్ సెంటర్లో ప్రాథమిక పాఠశాల తనిఖీ




**పిడుగురాళ్ల.ఆగస్టు 24,రాజధాని వాయిస్** మండల విద్యాశాఖ అధికారి ఎండీ ఖాసీం మండలంలోని మండల ప్రాథమిక పాఠశాల ఆర్ఆర్ సెంటర్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల సామర్థ్యాలు, ఎఫ్ ఏ వన్ మార్కుల వివరాలు పరిశీలించారు.ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి తమ క్యాచ్ మెంట్ పరిధిలో ఉన్న విద్యార్థులందరినీ పాఠశాలలో చేర్పించాలని, గ్రామస్తులు, తల్లిదండ్రుల సహకారంతో పాఠశాలలో విద్యార్థుల హాజరు నమోదు పెంచాలని, విద్యార్థులందరూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం నూరు శాతం భుజించే విధంగా కృషి చేస్తున్న ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

# పొలాల్లోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

**- శ్రీకాకుళం జిల్లాలో ప్రమాదం**
**- నలుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలు**
**- స్థానికుల సాయంతో ఆసుపత్రికి తరలింపు**
**- ప్రమాదంపై కేసు నమోదు చేసిన పోలీసులు**



**రాజధాని వాయిస్** శ్రీకాకుళం, : శ్రీకాకుళం జిల్లా రేగిడి మ ండలం తునివాడ సమీపంలో ప్రైవేటు పాఠశాల బస్సు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో నలుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడగా, మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సహాయక చర్యలు చేపట్టి విద్యార్థులను బయటకు తీసుకువచ్చారు. పాలకొండకు చెందిన తుమ్మినాయుడు పాఠశాల బస్సు విద్యార్థులను తీసుకెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 15 మంది విద్యార్థులు ప్రయాణిస్తున్నారని స్థానికులు తెలిపారు. ఒక్కసారిగా బస్సు అదుపు తప్పి రహదారి పక్కనున్న పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడటంతో విద్యార్థులు భయాందోళనలకు గురయ్యారు.ప్రమాదాన్ని గమనించిన గ్రామస్తులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన విద్యార్థులను స్థానికుల సహాయంతో రాజాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన నలుగురు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులు పర్యవేక్షిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమా, యాంత్రిక లోపమా అనే కోణాల్లో విచారణ కొనసాగుతోంది. ప్రమాదంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న వెంటనే పలువురు ఆసుపత్రికి చేరుకుని పిల్లల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తూ, బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. స్కూల్ బస్సుల భద్రతా ప్రమాణాలపై కూడా విచారణ చేపట్టనున్నట్లు సమాచారం.

# స్వర్ణాంధ్ర లక్ష్యాలకు డేటా దిక్సూచి

**- రెండేళ్లలో అభివృద్ధి ప్రణాళికలకు వేగం**
**- 175 నియోజకవర్గాల నుంచి 28 జిల్లాల వరకు డేటా ఆధారిత పాలన**
**- విజన్ నుంచి కార్యాచరణ వరకు ఏపీఎస్డీపీఎస్ కీలక పాత్ర**
**- సమర్థ పాలనకు సాంకేతిక వ్యవస్థల బలోపేతం**

**రాజధాని వాయిస్ అమరావతి, ఆగస్టు 25 :** స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధన దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్మెంట్ ప్లానింగ్ సొసైటీ (ఏపీఎస్డీపీఎస్) కీలక భూమిక పోషిస్తోందని అధికారులు తెలిపారు. గత రెండేళ్లలో రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలను మరింత శాస్త్రీయంగా రూపొందించేందుకు డేటా ఆధారిత విధానాలను ప్రభుత్వం విస్తృతంగా వినియోగిస్తోం దన్నారు. సమర్థ పాలన, పారదర్శక నిర్ణయాలు, వేగవంతమైన అభివృద్ధికి డేటా ప్రధాన సాధనంగా మారిందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 175 శాసనసభ నియోజకవర్గాలు, 28 జిల్లాలకు సంబంధించిన సామాజిక, ఆర్థిక, మౌలిక వసతుల సమాచారాన్ని సమగ్రంగా సేకరించి విశ్లేషించే ప్రక్రియను ఏపీఎస్డీపీఎస్ నిర్వహి స్తోంది. ఈ సమాచారం ఆధారంగా ప్రాంతాల వారీగా అవసరా లను గుర్తించి ప్రత్యేక అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఈ విధానంతో కలుగుతోందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, తాగునీరు, ఉపాధి, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక వసతులు వంటి రంగాల్లో పనితీరును నిరంతరం పర్యవేక్షిం చేందుకు ఆధునిక డేటా వ్యవస్థలను వినియోగిస్తున్నారు. వివిధ శాఖల సమాచారాన్ని ఒకే వేదికపై సమీకరించడం ద్వారా ప్రభుత్వ నిర్ణయాలు మరింత వేగవంతం అవుతున్నాయని అధికారులు తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో లోపాలను త్వరగా గుర్తించి పరిష్కరించే అవకాశం కూడా పెరిగిందన్నారు. స్వర్ణాం ధ్ర-2047 విజన్ను కార్యాచరణ స్థాయికి తీసుకెళ్లడంలో ఏపీఎస్ డీపీఎస్ కీలక వారధిగా పనిచేస్తోంది. రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించడమే కాకుండా వాటి అమలుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించడంలో సాంకేతిక సహకారం అందిస్తోంది. దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాలు మరియు తక్షణ అవసరాల మధ్య సమన్వయం సాధించడంలో ఈ సంస్థ పాత్ర ముఖ్యమని పేర్కొన్నారు.డేటా ఆధారిత పాలన ద్వారా ప్రభుత్వ పథకాల ప్రభావాన్ని క్షేత్రస్థాయిలో అంచనా వేయడం మరింత సులభమవుతోంది. ప్రతి నియోజకవర్గం, ప్రతి జిల్లాకు సంబంధించిన పురోగతి సూచీలను నిరంతరం విశ్లేషించడం ద్వారా వనరుల వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించగలుగుతున్నారని అధికారులు తెలిపారు. దీనివల్ల ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలకు చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సాంకేతికత, డేటా విశ్లేషణ, సమగ్ర ప్రణాళికల సమన్వయంతో ఆంధ్రప్రదేశ్ను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. స్వర్ణాంధ్ర-2047 దిశగా ప్రతి నిర్ణయం, ప్రతి ప్రణాళిక, ప్రతి అభివృద్ధి కార్యక్రమం డేటా ఆధారంగా రూపొందుతున్నట్లు అధికారులు వెల్లడించారు. భవిష్యత్ తరాలకు సుస్థిర అభివృద్ధి ఫలాలు అందించే రాష్ట్ర నిర్మాణంలో ఏపీఎస్డీపీఎస్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.

# రాజకీయ వేధింపుల కోసమే కేసులు: అంబటి

**- కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి విమర్శలు**
**- ఎఫ్ఐఆర్లతో భయపెట్టలేరని స్పష్టం**
**- రాజకీయ పోరాటం కొనసాగిస్తానన్న వైసీపీ నేత**



**రాజధాని వాయిస్ అమరావతి, ఆగస్టు 25 :** కూటమి ప్రభుత్వంపై రాజకీయ విమర్శలు చేస్తున్నందుకే తనపై వరుసగా కేసులు నమోదు చేస్తున్నారని వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. మంగళవా రం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని విమర్శించారు. రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుని కేసులు పెట్టడం ద్వారా భయపెట్టాలని చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. తనపై నమోదైన కేసులన్నీ ప్రస్తుతం ఎఫ్ఐఆర్ దశలోనే ఉన్నాయని, ఇప్పటివరకు ఏ ఒక్క కేసులోనూ ఛార్జ్షీట్ దాఖలు కాలేదని అంబటి రాంబాబు తెలిపారు. ఒకే అంశాన్ని ఆధారంగా చేసుకుని పలు కేసులు నమోదు చేయడం వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని ఆరోపించారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖ ర్పై సామాజిక మాధ్యమాల్లో చేసిన పోస్టు కారణంగా సీఐడీ కేసుతో పాటు మరిన్ని కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. తాజాగా పట్టాభి పురం పోలీస్ స్టేషన్లో మరో కేసు నమోదు చేయడం కూడా అదే ధోర ణికి నిదర్శనమని అన్నారు.తమ పార్టీని లక్ష్యంగా చేసుకుని అధికార పక్షం తరచూ విమర్శలు చేస్తోందని అంబటి చెప్పారు. తమపై 'గొడ్డలి పార్టీ' అనే వ్యాఖ్యలు చేస్తున్న నేపథ్యంలో రాజకీయ వ్యంగ్యంగా తన అధికారిక యూట్యూబ్ వేదికలో ఒక పాటను ప్రచురించినట్లు తెలిపారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ విమర్శలు సహజమని, వాటిని నేరంగా పరిగణించడం సరికాదని అభిప్రాయపడ్డారు. రాజకీయ అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కును అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్రెడ్డిపై సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరకర పోస్టులు, కృత్రిమ మేధ ఆధారిత వీడియోలు ప్రచారం చేసిన వారిపై ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోలేదని అంబటి ఆరోపించారు. అధికార పక్షానికి ఒక విధమైన న్యాయం, ప్రతిపక్షాలకు మరో విధమైన న్యాయం అమలవుతోందని అన్నారు. చట్ట అమలులో సమానత్వం కనిపించడం లేదని, ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదని వ్యాఖ్యానించారు.ఎన్ని కేసులు పెట్టినా రాజకీయంగా వెనక్కి తగ్గేది లేదని అంబటి రాంబాబు స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై తన స్వరం కొనసాగుతుందని, ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం ఆపబోనని తెలిపారు. రాజకీయ భిన్నాభిప్రాయాలను కేసులతో అణచివేయాలనే ప్రయత్నాలు చివరికి ప్రజల ముందే బహిర్గతమవుతాయని అన్నారు. ఈ సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నాయంటూ పోలీసు వ్యవస్థపై కూడా అంబటి ఆరోపణలు చేశారు. తమ ఫిర్యాదులపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం చూపుతున్నారని విమర్శించారు. రాష్ట్ర రాజకీయాల్లో ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, ప్రభుత్వం ప్రతిపక్షాల పట్ల వివక్ష చూపకుండా వ్యవహరించాలని మాజీ మంత్రి అంబటి రాంబాబు డిమాండ్ చేశారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com